# నిరుద్యోగుల్లో 83% యువతే!

## చదువుకొన్న యువతలో పెరిగిన నిరుద్యోగం

- 2000లో 35.2%.. 2022 నాటికి 65.7%
- అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 27: దేశంలో నిరుద్యోగం పెచ్చరిల్లుతున్నది. నిరుద్యోగుల్లో దాదాపు 83 శాతం మంది యువతేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదిక పేర్కొన్నది. ఐఎల్‌వో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్(ఐహెచ్‌డీ) సంయుక్తంగా 'భారత ఉపాధి నివేదిక-2024'ను ప్రచురించాయి. మొత్తం నిరుద్యోగ యువతలో కనీసం సెకండరీ విద్య చదువుకొన్న వారి సంఖ్య పెరుగుతుండటంపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. 2000లో 35.2 శాతం ఉన్న వీరి సంఖ్య 2022 నాటికి రెట్టింపై 65.7 శాతానికి చేరుకొన్నదని వెల్లడించింది. కరోనా సంక్షోభం సమయంలో ఉపాధి భారీగా పడిపోయిందని, ఈ కాలంలో చదువుకొన్న యువత అధిక నిరుద్యోగితను ఎదుర్కొన్నారని అధ్యయనం పేర్కొన్నది. 2000-2018 మధ్య శ్రామిక భాగస్వామ్య రేట్(ఎల్ఎఫ్‌పీఆర్), శ్రామిక జనాభా నిష్పత్తి(డబ్ల్యూపీఆర్) క్రమంగా తగ్గాయని, 2019 తర్వాత కొంత మెరుగైందని నివేదిక తెలిపింది.



### వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు

మరోవైపు రెగ్యులర్ కార్మికుల వేతనాలు, స్వయం ఉపాధి పొందే వారి ఆదాయం విషయంలో 2019 తర్వాత కొంత స్తబ్దత నెలకొనడంతోపాటు క్షీణించాయని నివేదిక తెలిపింది. 2022లో అయితే నైపుణ్యం లేని సాధారణ కార్మికుల్లోని చాలా మంది కనీస వేతనాలను కూడా అందుకోలేకపోయారని పేర్కొన్నది. ఉపాధి విషయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు చాలా భారీగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు ఉపాధి సూచీల్లో తక్కువ ర్యాంకుల్లో నిలిచాయి. బీహార్, యూపీ, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఏండ్లు పేలవమైన ఉపాధి తీరుతెన్నులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. స్థానికంగా ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అధ్యయనం ఎత్తిచూపింది.

### ఉపాధి అవకాశాలపై టెక్నాలజీ ప్రభావం

యువత అధికంగా ఉండే భారత్.. వారికి ఉపాధి కల్పన విషయంలో మాత్రం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నదని నివేదిక పేర్కొన్నది. కొవిడ్-19 సంక్షోభం యువత లేబర్ మార్కెట్‌లో సవాళ్లను పెంచిందని తెలిపింది. పెరిగిన సాంకేతికత కూడా ఉపాధిపై ప్రభావం చూపుతున్నదని, నైపుణ్యాల డిమాండ్‌ను పెంచిందని పేర్కొన్నది. యువతలో చాలా మందిలో ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత లేదని, ఇది నేటి కాలంలో వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నదని నివేదిక స్పష్టం చేసింది. భారత యువతలో 90 శాతం మంది స్ప్రెడ్‌షీట్‌లో మ్యాథ్‌మాటికల్ ఫార్ములా చేయలేకపోతున్నారని, 60 శాతం మందికి ఫైళ్లను కాపీ, పేస్టు చేయడం రాదని, 75 శాతం మందికి అయితే అటాచ్‌మెంట్లతో కూడిన మెయిళ్లను పంపడం తెలియదని పేర్కొన్నది.

### ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరించలేదు!

కాగా, భారత ఉపాధి నివేదిక-2024 విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగం వంటి అన్ని సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అనుకోవడం సరికాదని అన్నారు. ఉపాధి విషయంలో ప్రభుత్వం ఏమి చేయగలదంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సాధారణంగా ప్రపంచంలో వాణిజ్య రంగం నియామకాలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం ఇటీవల స్కిల్ ఇండియా మిషన్లు వంటి కార్యక్రమాలను చేపట్టిందని చెప్పుకొచ్చారు. అయితే అనంత నాగేశ్వరన్ వ్యాఖ్యలపై మరో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా స్పందించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, దాని సంబంధిత ఆర్థికవేత్తలు సమస్యను గుర్తించి, దానికి పరిష్కారం చూపే ప్రయత్నం చేయకుండా, భారత జాబ్ మార్కెట్‌పై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

## పెరుగుతున్న మనిషి మెదడు సైజు

**అమెరికా పరిశోధకుల వెల్లడి**

న్యూయార్క్, మార్చి 27: మనిషి మెదడు పరిమాణం పెరుగుతున్నదని అమెరికాకు చెందిన పరిశోధకులు చేసిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. కాలిఫోర్నియా యూనివర్సిటీలోని డెవిస్ హెల్త్‌కు చెందిన పరిశోధకులు మానవ మెదడుపై చేసిన అధ్యయనం వివరాలు జామా న్యూరాలజీ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. 1930లలో పుట్టిన వారితో పోలిస్తే 1970లలో పుట్టిన వారి మెదడు సైజు 6.6 శాతం ఎక్కువ ఉన్నట్టు తేలింది. 1999 నుంచి 2019 మధ్యకాలంలో 3,226 మంది మెదడును ఎంఆర్ఐ తీసి అధ్యయనం చేయగా.. 1930లలో జన్మించిన వారి మెదడు సగటున 1,234 మిల్లీలీటర్లు ఉండగా, 1970లలో పుట్టిన వారి మెదడు 1,321 మిల్లీలీటర్లు ఉన్నట్టు గుర్తించారు. మెదడు నిర్మాణంలో భాగమైన వైట్ మ్యాటర్, గ్రే మ్యాటర్, హిప్పోక్యాంపస్ సైజు కూడా పెరిగినట్టు తేల్చారు. కాగా, ఇలా మెదడు సైజు పెరగడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధకులు చెప్తున్నారు. ముఖ్యంగా వయసు పెరిగే వారిలో మతిమరుపు, చిత్తవైకల్యం ముప్పు తగ్గుతుందని తెలిపారు. ఇదే సమయంలో మెదడు సైజు పెరగడం వల్ల మెదడు బాగా అభివృద్ధి చెందుతుందని, మానసిక ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు.

## న్యూజెర్సీ వ్యక్తికి 9,417 కోట్ల జాక్‌పాట్

న్యూజెర్సీ: న్యూజెర్సీకి చెందిన ఓ వ్యక్తిని లాటరీలోఅదృష్ట దేవత వరించింది. దాదాపు 30 డ్రాయింగ్స్ నుంచి భారీ బహుమతి ఎవరికీ దక్కలేదు. చివరికి మంగళవారం రాత్రి జరిగిన డ్రాయింగ్‌లో విజేతకు రూ.9,417.60 కోట్ల జాక్‌పాట్ తగిలింది. ఈ మెగా మిలియన్స్ జాక్‌పాట్ లాటరీలో గత ఏడాది డిసెంబరు 8 తర్వాత ఆరు నంబర్లు మ్యాచ్ అవడం ఇదే తొలిసారి. ఈ టికెట్ జెర్సీ షోర్‌లోని ఓ షాపులో అమ్ముడైనట్లు లాటరీ నిర్వాహకులు తెలిపారు. అమెరికన్ లాటరీ చరిత్రలో ఈ బహుమానం ఎనిమిదో అతి పెద్దది కావడం విశేషం. విజేతకు ఈ సొమ్ములో కొంత భాగం ముందుగా చెల్లించి, ఆ తర్వాత 29 వార్షిక వాయిదాల్లో మిగిలిన భాగాన్ని చెల్లిస్తారు.

## 19% ఆహారం వృథా

**78.3 కోట్ల మంది ఆకలి కేకలు**

నైరోబి, మార్చి 27: ప్రపంచవ్యాప్తంగా 78.3 కోట్ల మంది ఆకలి కోరల్లో చిక్కుకోగా, మరోవైపు ఆహారంలో 19 శాతం (2022లో) వృథా అయ్యిందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక పేర్కొన్నది. 2024 ఏడాది 'ఫుడ్ వేస్ట్ ఇండెక్స్' నివేదికను ఐరాస బుధవారం విడుదల చేసింది. 2030 నాటికి ఆహార వ్యర్థాలను సగానికి తగ్గించే లక్ష్యంతో ఆయాల దేశాల పురోగతిని ఐరాస ట్రాక్ చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఆహార వృథాపై పరిశోధకుల విశ్లేషణలు, అంచనాలు ఈ విధంగా ఉన్నాయి.



**ఫుడ్ వేస్ట్ ఇలా..**

| 2022లో | 2019లో |
|---|---|
| 19 శాతం | 17 శాతం |

79 కిలోగ్రాములు-ఏటా సగటున ఒక వ్యక్తి చేస్తున్న ఆహార వృథా

**వృథా ఎక్కడ ఎలా?**

| ఇండ్లు | హోటల్స్, రెస్టారెంట్స్ |
|---|---|
| 60 శాతం | 28 శాతం |

రిటైలర్స్ 12 శాతం

## సెకనుకు 301 టెరాబైట్ల వేగం!

- ఇంటర్నెట్ వేగంలో యూకే పరిశోధకుల రికార్డు

లండన్, మార్చి 27: ఇంటర్నెట్ స్పీడ్‌లో యూకేకు చెందిన పరిశోధకులు కొత్త రికార్డును సృష్టించారు. బర్మింగ్‌హామ్‌లోని ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన బృందం ప్రామాణిక ఆప్టికల్ ఫైబర్‌ను వినియోగించి సెకనుకు 301 టెరాబిట్ల(టీబీపీఎస్) (9000 హెచ్‌డీ సినిమాలకు సమానం) ఇంటర్నెట్ వేగాన్ని సృష్టించారు. సగటు బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ స్పీడ్ కన్నా ఇది దాదాపు 45 లక్షల రెట్లు ఎక్కువ అని పరిశోధకులు తెలిపారు. ఈ స్పీడ్ ద్వారా ఇంటర్నెట్ మూవీ డాటాబేస్(ఐఎండీబీ)లో ఉన్న ప్రతి సినిమానీ కేవలం ఒక్క నిమిషంలోపే డౌన్‌లోడ్ చేయవచ్చు. ఒక కొత్త ఆప్టికల్ ప్రాసెసింగ్ పరికరాన్ని అభివృద్ధి చేయడం ద్వారా వీరు ఇంటర్నెట్ స్పీడ్‌లో ఈ రికార్డును సాధించారు. సాధారణంగా ఇండ్లు, కార్యాలయాల్లో ఇంటర్నెట్ కనెక్షన్ కోసం వినియోగించే ఆప్టికల్ ఫైబర్‌ను వినియోగించే ఈ స్పీడ్‌ను అందుకున్నట్టు ఆస్టిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఐయాన్ ఫిలిప్స్ తెలిపారు.

## అమెరికా ఆవు పాలల్లో బర్డ్ ఫ్లూ

న్యూయార్క్, మార్చి 27: అమెరికాలోని టెక్సాస్, కాన్సాస్ సహా వివిధ రాష్ట్రాల్లోని డైరీ ఫామ్ ఆవుల్లో, వాటి పాలల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉందన్న విషయం బయటపడింది. దీంతో వైరస్ జంతువుల నుంచి మనుషులకు సోకే ప్రమాదముందని, ప్రజలకు అత్యంత చేరువగా వైరస్ వచ్చిందని సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి. టెక్సాస్, కాన్సాస్ రాష్ట్రాల్లో వేలాది ఆవుల్లో హెచ్5ఎన్1 టైప్-ఏ పాజిటివ్ వచ్చిందని, జంతువుల్లో వైరస్ ఈ స్థాయిలో వ్యాప్తి చెందటం ఇదే తొలిసారి అని అక్కడి వైద్య వర్గాలు చెబుతున్నాయి. బద్ధకం, ఆకలి లేకపోవటం వంటి లక్షణాలు ఆవుల్లో కనపడటంతో వైరస్‌బారిన పడిన సంగతి గుర్తిస్తున్నామని, దీంతో పాల ఉత్పత్తిని తగ్గించామని రైతులు చెబుతున్నారు.



## టైటానిక్ తలుపునకు రికార్డు ధర

న్యూయార్క్, మార్చి 27: జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన టైటానిక్ చిత్రం పేరు వినగానే 1500 మంది మృత్యువాత పడిన విషాద ఘటనతో పాటు అద్భుతమైన ప్రేమ కావ్యం మన కళ్ల ముందు కదలాడుతుంది. ముఖ్యంగా క్లైమాక్స్‌లో హీరోయిన్ రోజ్‌ను రక్షించడం కోసం హీరో కేట్ జాక్ పాత్రధారి ఒక తలుపు చెక్కపై ఆమెను ఉంచి తాను ప్రాణాలు విడిచే సన్నివేశం చాలామంది మర్చిపోలేరు. ఆ డోర్ రికార్డు స్థాయిలో 718,750 డాలర్ల (సుమారు 6 కోట్ల రూపాయలు)కు వేలంలో అమ్ముడు పోయింది. హెరిటేజ్ ఆక్షన్ ట్రెజర్స్‌లో ఈ టైటానిక్ అవశేషం అత్యధిక వసూలు సాధించిన వస్తువుగా నిలిచింది. వాస్తవానికి అది తలుపు చెక్క కాదు. ఓడ ఫస్ట్ క్లాస్ లాంజ్ ప్రవేశద్వారం పైన ఉన్న డోర్ ఫ్రేమ్‌లోని భాగాన్నే తలుపు చెక్కగా చూపించినట్టు నిర్మాతలు తెలిపారు. విన్స్‌లెట్ వాడిన షిఫాన్ డ్రెస్ సైతం వేలంలో 125,000 డాలర్ల (రూ.1.05 కోట్లు) ధర పలికింది.

## దవాఖాన నుంచి జగ్గీ వాసుదేవ్ డిశ్చార్జ్

న్యూఢిల్లీ, మార్చి 27: మెదడు సర్జరీ తర్వాత కోలుకున్న ఆధ్యాత్మిక గురువు, సద్గురు జగ్గీ వాసుదేవ్ బుధవారం దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నదని దవాఖాన వర్గాలు వెల్లడించాయి. మార్చి 17న ఆయనకు మేజర్ సర్జరీ జరిగింది. మెదడులో రక్తస్రావం వల్ల అత్యవసరంగా సర్జరీ చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆయన ప్రాణాంతక స్థితిలో ఉన్నారని, సర్జరీ వల్ల ప్రాణాపాయం తప్పిందని సర్జరీకి నాయకత్వం వహించిన సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ వినిత్ సూరి వెల్లడించారు.



## ఏండ్ల తరబడి సివిల్స్ సన్నద్ధతతో యువశక్తి వృథా

- ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్

న్యూఢిల్లీ, మార్చి 27: ఐఏఎస్, ఇతర సివిల్ సర్వీస్ పరీక్షల కోసం లక్షలాది మంది విద్యార్థులు 5 నుంచి 8 ఏండ్ల పాటు కష్టపడటం యువశక్తిని వృథా చేయడమేనని ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ పేర్కొన్నారు. సివిల్ సర్వీసుల్లో ఉద్యోగం చేయాలనుకునే వారు యూపీఎస్సీ కానీ, సంబంధిత ఏ పరీక్ష కానీ ఒక్కసారి మాత్రమే ప్రయత్నించాలన్నారు. కానీ మన దేశంలో వచ్చిన సమస్య ఏంటంటే లక్షలాది మంది యువత ఏండ్ల తరబడి సిద్ధమవుతూ అదే తమ జీవన విధానంగా మార్చుకుంటున్నారన్నారు. దీని కారణంగా యువశక్తి ఎంతో వృథా అవుతున్నదని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లో దీనికే వెళ్లాలనుకునే వారికి రెండు ప్రయత్నాలు వరకు సబబేనని, అయితే మీ 20 ఏండ్ల ప్రాయాన్ని అంతా దీనికే వృథా చేయవద్దని ఆయన సూచించారు.



### ఒక్క ఏడాదిలో సివిల్స్ సాధ్యం కాదు

సంజీవ్ సన్యాల్ చేసిన వ్యాఖ్యలను పలువురు మాజీ బ్యూరోక్రాట్లు కొట్టివేశారు. గుజరాత్ కేడర్‌కు చెందిన 1962 బ్యాచ్ మాజీ ఐఏఎస్ అధికారి సుందరం మాట్లాడుతూ సంజీవ్ సూచనను పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. లక్షలాది మంది పోటీ పడే సివిల్స్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం అంత సులభమేమీ కాదని అన్నారు. మరో మాజీ ఐఏఎస్ అధికారి ఎస్కే సర్కార్ మాట్లాడుతూ ఈ పరీక్షకు సన్నద్ధులవ్వడం కారణంగా యువశక్తి కానీ, వనరులు కానీ వృథా కావని, వారిలో తెలివితేటలు విస్తృతమవుతాయని స్పష్టం చేశారు.


